శాతకర్ణి
శనివారం, జనవరి 15, 2022

# సామాజిక సేవ.. సాంప్రదాయాల పట్ల నేటి విద్యార్థులకు అవగాహన అవసరం

శాతకర్ణి ప్రత్యేక ప్రతినిధి, ఉయ్యూరు

నేటి విద్యార్థులకు సామాజిక అంశాల పట్ల, సామాజిక సేవా కార్యక్రమాల పట్ల అవగాహన అంతగా లేకుండా ఉందని, ప్రస్తుత తరుణంలో ప్రతిఒక్క విద్యార్థి సామాజిక సేవా కార్యక్రమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అదే విధంగా సంస్కృతి, సాంప్రదాయాల పట్ల కూడా విద్యార్థి దశ నుండే ఉపాధ్యాయులు అవగాహన కల్పించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని తెలుగు విభాగాధిపతి ఎం.ఎల్.ఎస్. కుమారి అన్నారు.

ఉయ్యూరులోని వి.ఆర్ అండ్ ఎస్.బి సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని యాకమూరు, గరికపర్రు గ్రామాలలో ఎన్.ఎస్.ఎస్ సేవా శిబిరాలను ఇటీవల కళాశాల ప్రిన్సిపల్ కే సత్యనారాయణ ప్రారంభించారు. తెలుగు భాషా విభాగాధిపతి ఎం.ఎల్.ఎస్ కుమారి పర్యవేక్షణలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు సుమారు వారం రోజులపాటు గ్రామంలో పర్యటించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను శుభ్రం చేయడంతో పాటు పంచాయితీ బజార్లు, పాఠశాల భవనాలు, తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, మొక్కల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా కరోనా పరిస్థితుల దృష్ట్యా మాస్కుల ఆవశ్యకత తెలియజేస్తూ ప్రజలకు వాటిని అందజేశారు. అదే విధంగా మొక్కల పెంపకం, ప్రభుత్వ పథకాల అవగాహనపై విద్యార్థులతో పాటు ఆయా గ్రామాల ప్రజలను కూడా చైతన్యవంతం చేశారు. అదే విధంగా సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకుగాను కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మంటలు, హరిదాసుల సంకీర్తనలు, పాలపొంగళ్లను, అందమైన హరివిల్లులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు తదితర అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్, తెలుగు భాషా అధ్యాపకులు ఎం.ఎల్.ఎస్ కుమారి, ఎం.రమాదేవి, కె.జ్యోతి, తదితరులు విద్యార్థులలో సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించారు. ఆయా విషయాలను తెలుసుకున్న విద్యార్థులు మన సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక సేవా కార్యక్రమాలు తెలుసుకోవడం గొప్ప అనుభూతిని కలిగించిందని చెప్పారు. ఆయా కార్యక్రమాలకు సహకరించిన కళాశాల యాజమాన్యం వారికి, విద్యార్థులకు తెలుగు భాషా విభాగాధిపతి ఎం.ఎల్.ఎస్ కుమారి ధన్యవాదాలు తెలియజేశారు.



ఎం.ఎల్.ఎస్.కుమారి




12
HAPPY PONGAL